అదానీని అడుగుపెట్టనియ్యలే

మొదటిపేజీ తరువాయి...

పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిని తూర్పారబట్టారు. కాంగ్రెస్ పార్టీ నాగ్‌పూర్‌లో నిర్వహించిన సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి దేశంలో డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధానే అని ఎండగట్టి ఇప్పుడు అదే అదానీతో చెట్టాపట్టాల్ వేసుకుంటున్నారని విమర్శించారు.

మెదక్ లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు, హరీశ్‌రావు, పోచారం, సునీతా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, పార్టీ నేతలు పద్మాదేవేందర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటే

రాష్ట్రంలో బీఆర్ఎస్ బలమైన గొంతుక అని, ప్రజలు బీఆర్ఎస్‌తో ఉన్నారని గ్రహించి కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా తమపై దుష్ప్రచారం చేశాయని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్‌ను బీజేపీ బీ టీం అని ఇరు పార్టీలు గతంలో చేసిన ప్రచారాన్ని ఉదహరించారు. బీజేపీ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రశ్నించదని, అలాగే కాంగ్రెస్‌ను బీజేపీ ప్రశ్నించదని ఉదహరించారు. ఏ పార్టీ ఏ పార్టీకి బీ-టీమో జరుగుతున్న పరిణామాలే కండ్లకు కడుతున్నాయని అన్నారు. బండి సంజయ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను బట్టి ఎవరు ఎవరి టీమో స్పష్టంగా తెలిసిపోతున్నదని చెప్పారు. ఈ విషయంలో ఇప్పుడిప్పుడే ప్రజలకు స్పష్టత వస్తున్నదని, రాబోయే రోజుల్లో అది మరింత తేటతెల్లం అవుతుందని తెలిపారు.

ఎత్తగొడితే ఎండగట్టండి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు కాదని, అవి మొత్తం 420 అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ హామీలను ఎత్తగొట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నదని, ఎత్తగొడితే బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీని ఎక్కడిక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా మాట్లాడుతూ 'అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9 నాడే రుణ మాఫీ చేస్తా.. 2 లక్షల రుణం తెచ్చుకోండి' అని చెప్పారని, ఇప్పుడు రుణమాఫీ చేయలేక మాట తప్పారని మండిపడ్డారు. రైతుల నుంచి రుణాలు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేయటమే కాకుండా కేసులు పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి విషయంలో అసెంబ్లీ సాక్షిగా తాము హామీ ఇవ్వలేదని తప్పించుకొన్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, వెంకట్రాంరెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భూపాల్ రెడ్డి, కర్నె ప్రభాకర్, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌సహా మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ ఆహ్వానిత ప్రతినిధులు పాల్గొన్నారు.

కరోనా సమయంలోనూ రైతుబంధు ఆపలేదు: హరీశ్‌రావు

రైతుల ప్రయోజనాలే పరమావధిగా కేసీఆర్ నిరంతరం తపించారని, కరోనా సమయంలోనూ రైతుబంధును ఆపకుండా వేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఉన్న రూ.10వేలను వేయకుండా మోసం చేసిందని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. రైతుబంధు విషయంలో కేసీఆర్‌కు, రేవంత్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ముల్లును ముల్లుతోనే తీద్దామని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోనే బీఆర్ఎస్‌కు ఆయుధమని పేర్కొన్నారు. కేసీఆర్ పథకాల అమలులో పోటీపడితే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడంలో పోటీపడుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు కేసులు కొత్తకాదని, న్యాయం కోసం, ప్రజలకు సేవ చేయడం కోసం ఎంతదాకా అయినా పోరాటం చేద్దామని అన్నారు. పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని చెప్పారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఈ ఓటమి తాత్కాలికమేనని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారని చెప్పారు.

కుమ్మక్కు రాజకీయాలను ప్రజలకు చెప్పాలి

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలకు విడమరచి చెప్పేందుకు ప్రతీ గులాబీ సైనికుడు పోటీపడాలని హరీశ్‌రావు సూచించారు. కాంగ్రెస్, బీజేపీతో కుమ్మక్కై రెండు ఎమ్మెల్సీల నోటిఫికేషన్‌ను వేర్వేరుగా ఇచ్చిందని అన్నారు. అదానీ, ప్రధాని ఒక్కటేనని ఆరోపించిన రేవంత్‌రెడ్డి అదానీతో ఒప్పందాలు ఎందుకు కుదుర్చుకొన్నారని ప్రశ్నించారు. తాము పనిని నమ్ముకొంటే కాంగ్రెస్ పార్టీ గోబెల్స్‌ను నమ్ముకున్నదని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత నిజమైన మార్పు వస్తుందని చెప్పారు. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఎక్కడిక్కడ ఎండగట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ కార్యకర్తలు కసితో పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో సింహాల్లా గర్జించాలని పిలుపునిచ్చారు.

చెత్త పోయిందని భావిద్దాం

అక్కడక్కడా పార్టీని వీడేవాళ్ల గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధికారం కోసం బీఆర్ఎస్‌లో చేరారని, అదే అధికారం కోసం కాంగ్రెస్ పార్టీకి వెళ్తున్నారని అలాంటి వారి గురించి పట్టించుకోవద్దని సూచించారు. పార్టీ నుంచి చెత్త వెళ్లిపోతున్నదని భావిద్దామని పేర్కొన్నారు. కష్టమైనా సుఖమైనా, ఆపతి సంపతిలో మనతో ఉండేవాళ్లే మనోళ్లు అని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్సే తెలంగాణ గళం

పార్టీ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో క్రియాశీలకంగా పని చేయడంతో గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక మెజార్టీ సాధించిందని, ఈసారి కూడా అదే చరిత్ర పునరావృతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పదేండ్లలో తెలంగాణ తరుపున గళం విప్పింది బీఆర్ఎస్ ఎంపీలేనని వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, తెలంగాణ బలం, గళం, గులాబీ జెండా పార్లమెంట్‌లో ఉండాలని అన్నారు. లేదంటే తెలంగాణ ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని, జరుగుతున్న పరిణామాలే అందుకు అద్దం పడుతున్నాయని తెలిపారు. ఇదే విషయం ప్రజలకు చెప్పాలని సూచించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోట అని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ కన్నా మెదక్ పార్లమెంట్ పరిధిలో 2 లక్షల 48 వేల ఓట్ల ఆధిక్యత సాధించిదని, ఇందుకు పార్టీ శ్రేణులు చాలా కృషిచేశారని అభినందించారు.

ఆవుతోక పట్టుకుని..

చెరువులోకి దిగి బాలుడి మృతి

నస్రుల్లాబాద్, జనవరి 19: ఆవు తోక పట్టుకుని చెరువులోకి దిగిన ఓ బాలుడు నీట మునిగి చనిపోయాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సోము శ్రీనివాస్ (16) కొన్నేండ్లుగా పశులను కాస్తున్నాడు. రోజుమాదిరిగానే పశువులను తోలుకుని గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ ఆవు తోకను పట్టుకుని చెరువులోకి దిగాడు. చెరువు మధ్యలోకి వెళ్లాక ఆవు తోకను వదిలేశాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి చనిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్సై నర్సింహులు తెలిపారు.

గిట్టుబాటు ధర లేక పత్తి రైతుల ఆందోళన

కాశీబుగ్గ, జనవరి 19: పత్తి రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరంతో పోల్చితే చాలా వరకు పత్తి దిగుబడితోపాటు ధరలు తగ్గాయి. గత ఏడాది క్వింటా పత్తి అత్యధికంగా రూ.8,500 పలుకగా, ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే సీసీఐ వారు మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు పత్తి బస్తాలను మద్దతు ధర కంటే తక్కువకే రూ.6,500 చొప్పున కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ICFRE- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటి
(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ & ఎడ్యుకేషన్)
(పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం క్రింద పని చేస్తున్న ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థ)
దూలపల్లి, కొంపల్లి S.O., హైదరాబాద్-500 100, ఫోన్: 040-66309500,
ఫ్యాక్స్: 040-66309521, ఇ-మెయిల్: director_ifb@icfre.org, వెబ్‌సైట్: http://ifb.icfre.gov.in
No.1-241/HR/AICRP-JRF/PA/PA/2023-2024/1916 తేదీ: 19 జనవరి, 2024
వాక్-ఇన్-ఇంటర్వ్యూ
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ (IFB), దూలపల్లి, కొంపల్లి (S.O), హైదరాబాద్-500 100లో దిగువ రిసర్చ్ ప్రాజెక్ట్స్‌లో పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన మరియు ప్రాజెక్ట్ కాలవ్యవధితో కో-టెర్మినస్ లేదా ICFRE ప్రమాణాల ప్రకారం అర్హత కాలవ్యవధి పూర్తిఅయ్యేంత వరకు ప్రాజెక్ట్ అసిస్టెంట్స్ (PA) పొజిషన్స్ కొరకు 02 ఫిబ్రవరి, 2024న ఉ.10.00 గం. నుండి మ.12.00 గం. వరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి. ఆసక్తిగల మరియు అర్హతగల అభ్యర్థులు దిగువ పొజిషన్స్ కొరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూకి హాజరు కావలసిందిగా కోరబడుతున్నారు.
వాక్-ఇన్-ఇంటర్వ్యూ షెడ్యూల్ దిగువ వివరించబడినది

క్రమ సంఖ్య	పొజిషన్ పేరు	పోస్టుల సంఖ్య	ఇంటర్వ్యూ తేది
1.	ప్రాజెక్ట్ అసిస్టెంట్	02	02.02.2024

సం/- డైరెక్టర్

జీర్ణశక్తికి మేక పాలు

- గ్యాస్, ఉబ్బర సమస్య ఉండదు
- ఆవు పాల కన్నా 12% లాక్టోస్ తక్కువ

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): జీర్ణశక్తికి మేక పాలు ఎంతో శ్రేష్ఠమైనవని నిపుణులు సూచిస్తున్నారు. పోషకాలు సమృద్ధిగా ఉండే ఈ పాలలో ఆవు పాలతో సమానమైన కొవ్వు పదార్థం ఉంటుందని పేర్కొంటున్నారు. ఆవు, బర్రె పాలతో పోల్చితే తక్కువ ధర ఉండే మేక పాలు త్వరగా జీర్ణం అవుతాయని, పొట్టలో గ్యాస్, ఉబ్బర సమస్యలు రావని చెప్పున్నారు. 'మేక పాలు కడుపులోకి వెళ్లిన తర్వాత పెరుగుగా మారుతుంది. ఈ పెరుగు ఆవు పాలతో చేసిన పెరుగు కంటే మెత్తగా ఉంటుంది. ఆవు పాలలో 10 శాతం పెరుగు ఉంటే, మేక పాలలో 2 శాతం మాత్రమే ఉంటుంది. ఇది శరీర జీర్ణక్రియకు సహాయపడుతుంది' అని వివరిస్తున్నారు. ప్రస్తుతం ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల్లో మేకపాలతో చేసిన ఉత్పత్తులను అధికంగా వినియోగిస్తున్నారని పేర్కొంటున్నారు.

మేక పాలలో ఆరోగ్య గుణాలు:

- మేకపాలలో ఫ్యాటీ యాసిడ్స్, ఒలిగోశాకరైడ్లు ఉంటాయి. వీటిలో యాంటిఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. శరీరంలో మంటను తగ్గించి, రోగ నిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది.
- ఒక కప్పు మేక పాలలో ఆవు పాల కంటే 12 శాతం తక్కువ లాక్టోస్ ఉంటుంది. లాక్టోస్ సెన్సిటివిటీ ఉన్నవాళ్లు మేకపాలు తాగొచ్చు.
- ఈ పాలలో ప్రీబయాటిక్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి కడుపులో మంచి బ్యాక్టీరియా పెరుగడలకు తోడ్పడుతాయి.
- మేక పాలలో విటమిన్-ఏ, బీ కాంప్లెక్స్, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం ఉంటాయి.

రైతు రుణమాఫీ ఏమైంది?

- డిసెంబర్ 9నే 2లక్షలు మాఫీ చేస్తామన్నారు
- ధాన్యానికి రూ.500 బోనస్ అమలెక్కడ?
- తప్పడు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్
- బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన
- మెదక్ ఎంపీ స్థానం మళ్లీ బీఆర్ఎస్‌దే
- మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి వెల్లడి

శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): డిసెంబర్ 9నే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామన్న కాంగ్రెస్, ఇప్పటివరకూ ఎందుకు చేయలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. తప్పుడు వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు హామీల ఊసెత్తడం లేదని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, ఇందిరమ్మ ఇండ్లు, రూ.2 లక్షల రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, ఎన్నికల్లో ఓడిపోయినవారు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేల హక్కులకు గౌరవం ఇవ్వడంలేదని, రాజ్యాంగం కల్పించిన హక్కులను తుంగతలో తొక్కుతున్నారని ఆరోపించారు. అధికారిక కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ అడ్డా

మెదక్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్‌కు అడ్డాగా ఉన్నదని సునీత తెలిపారు. ఇప్పటికే వరుసగా మూడుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారని, వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ శ్రేణులపై ప్రభుత్వం అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధిత కార్యకర్తలకు అండగా ఉంటామని కేటీఆర్, హరీశ్‌రావు భరోసా ఇచ్చారని తెలిపారు. గతంలో నియోజకవర్గంలో మంజూరైన ఎస్‌డీఎఫ్, మున్సిపాలిటీ, పీఆర్, ఇతర శాఖల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసిందని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గానికి రూ.200 నుంచి రూ.300 కోట్ల పనులను రద్దు చేసిందని తెలిపారు. ఆ పనులన్నీ తిరిగి కొనసాగించాలని డిమాండ్‌చేశారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందన చెరువును కబ్జా కానివ్వం

నమస్తే ఎఫెక్ట్

- బాలాపూర్ తాసిల్దార్ మాధవీరెడ్డి
- విద్యుత్తు మీటర్ల రద్దుకు అధికారులకు ఫిర్యాదు
- చెరువు శిఖంలోని ఇండ్లకు ఇంటి నంబర్లు ఇవ్వొద్దని మున్సిపల్ అధికారులకు లేఖ
- చెరువు కబ్జాపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు

బడంగ్‌పేట, జనవరి 19: రంగారెడ్డి జిల్లా కందుకూరు డివిజన్ జల్‌పల్లి గ్రామ పరిధిలోని చందన చెరువు కబ్జాపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'చందన చెరువు శిఖం ఫలహారం' శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కబ్జా కథనంపై స్థానికంగా రోజంతా చర్చ జరిగింది. సోషల్ మీడియాలో కథనం చక్కర్లు కొట్టింది. దీంతో స్పందించిన తాసిల్దార్ మాధవీరెడ్డి చెరువు శిఖంను కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ఒక్క రెవెన్యూ అధికారులది మాత్రమే కాదని, చెరువులను కాపాడాల్సిన పూర్తి బాధ్యత ఇరిగేషన్ అధికాలపై ఉన్నదని పేర్కొన్నారు. చెరువులు, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే మున్సిపల్ అధికారులు కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఏ ఆధారాలు లేకుండా విద్యుత్తు అధికారులు మీటర్లు జారిచేయడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. మీటరు కోసం దరఖాస్తు చేసిన తర్వాత విద్యుత్తు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వెల్లడించారు. మీటర్ కోసం ఇండ్ల పట్టాలు, నోట్రీలు ఇస్తే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇక నుంచి ఏదీ పరిశీలించకుండా మీటర్లు ఇవ్వొద్దని విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చందన చెరువు కబ్జా స్థలంలో నిర్మించిన ఇండ్లకు ఇచ్చిన మీటర్లు రద్దు చేస్తామని విద్యుత్తు అధికారులు చెప్పారని వివరించారు. మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు ఇచ్చే ముందు పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఇంటి నంబర్ ఇవ్వొద్దని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. చెరువుల అంశంపై ఇరిగేషన్ అధికారులకు లేఖ రాశామని తెలిపారు. చందన చెరువు శిఖ భూమిపై సర్వే చేయిస్తామని, నఖిలీ పత్రాలు సృష్టించి చెరువు భూములను కాజేయాలని చూసినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

అమర జవాన్ నిలువెత్తు జ్ఞాపకం

దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ పబ్బల్ల అనిల్ స్మృత్యార్థం కుటుంబ సభ్యులు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మల్కాపూర్‌లో నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆర్మీలో సీఎఫ్ఎన్ టెక్నీషియన్ అయిన అనిల్ గతేడాది మే4న జమ్మూ కశ్మీర్‌లో ధ్రువ్ హెలీకాప్టర్ ప్రమాదంలో అమరుడయ్యారు. కుటుంబ సభ్యులు అనిల్ విగ్రహాన్ని పొలం వద్ద ఏర్పాటు చేయగా శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో అనిల్ సతీమణి సౌజన్య ఆవిష్కరించారు. - బోయినపల్లి

అరుదైన మొక్కను కనుగొన్న వనపర్తి వాసి

అరుదైన మొక్క: ఇన్‌సెట్‌లో భరత్ సింహయాదవ్

వనపర్తి టౌన్, జనవరి 19 : అంతరించిపోతున్న మొక్కను కనుగొన్నాడు వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన భరత్‌సింహ యాదవ్. ఈయన తమిళనాడులోని మధురైలో ఉన్న మధుర కళాశాలలో ప్రొఫెసర్ కరుప్పుస్వామి ఆధ్వర్యంలో వృక్షశాస్త్రంలో పరిశోధనలు చేస్తున్నారు. దేశంలోని పశ్చిమ కనుమల్లో అంతరించిపోతున్న మొక్కల జీవిత చిత్రం అనే అంశంపై పరిశోధనలు సాగిస్తున్నారు. అందులో భాగంగానే తమిళనాడులోని తేని జిల్లాలో ఓ కొత్త మొక్కను కనుగొన్నారు. ఈ మొక్కకు 'ఆండ్రోగ్రాఫిస్ థేనియెన్సిస్' అని నామకరణం చేశారు. ఈ రకమైన జాతి మొక్కలు బంగ్లాదేశ్, భారత్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, పశ్చిమ హిమాలయాల్లో విస్తరించి ఉంటాయి.